# టీవి సీరియల్ నూరేళ్ళ పంట

**ఒ**కప్పుడు ఫామిలీ ఎంటర్‌టెయిన్ మెంటంటే కేవలం వారపత్రికలూ, సినిమాలూ,

లేదా రేడియో!

వార పత్రికల్లో సీరియల్స్ కోసం ఆడా మగా వారమంతా తెగ ఎదురు చూసేవారు. రేడియోలో వచ్చే సినిమా సౌండ్‌ట్రాక్‌లూ, నాటకాలూ చాలా పెద్దహిట్! అప్పుడప్పుడు రేడియో స్టేషన్ వాళ్లు వినిపించే సినిమాపాటల కోసం చిన్నా చితకా, ముసలీ ముతకా – మొత్తం ఫామిలీ అంతా పడిగాపులు కాసేవాళ్ళు.

ఇప్పుడు టివి ఛానెల్స్ రావడంతో పాతవన్నీ విసిరవతల పారేశారు జనం! టీవి సీరియల్స్ ఫామిలీ లేడీస్‌కి ఒక వ్యసనంగా మారిపోయాయ్. యూత్, మగాళ్లు మరో ప్రోగ్రాం మాయలో పడిపోవడంతో ప్రతి ఇంట్లోనూ రెండు లేక మూడు టివి లు ఏర్పాటు చేసుకుపోవలసి వచ్చింది. అపార్ట్‌మెంట్ కల్చర్ వల్ల పక్క ఫ్లాట్‌లు ఎవరుంటున్నారో తెలీని పరిస్థితులోస్తే టివి చానెల్స్ వల్ల ఒక ఫామిలీలో వారే ఒకరితో ఒకరు మాట్లాడుకోవటం కూడా కష్టమయిపోతోంది. అసలు ఒకరికొకరం కనిపించని రోజులు కూడా ఉంటున్నాయ్.

"పెద్దాడెక్కడ? కనబట్టంలా!"

"వాడిరూమ్‌లోనే టివి చూస్తున్నాడు కదండీ"

"మరి అమ్మాయ్?"

"మేడ మీద దాని గదిలో సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డాన్స్ ప్రోగ్రామ్స్ చూస్తోంది."

"మరి నువ్వా నిన్నటి నుంచి కనబడటం లేదేం? ఊళ్ళోనే ఉన్నావా?"

"బాగుందండోయ్– నేనెక్కడి కెళ్తా! నా రూమ్‌లోనే ఉన్నా! రోజూ సెల్‌లో మీతో మాట్లాడుతూనే ఉన్నానుగా?"

"అవునవున్లే"

ఇలా ఉంటుంది వ్యవహారం. ఒకావిడ టివి. ముందుకూర్చుని ఏడుస్తుంటే పని మనిషి చూసింది. "ఎందుకమ్మా ఏడుస్తున్నారు? సీరియల్ ఎవరయినా పోయారా?" "కాదే! మా ఆయనకి హార్ట్ ఎటాక్ వచ్చిందే ఇందాక! హాస్పిటల్‌కి పంపించాను. నేను

ఆయన్తో పాటు వెళ్దామంటే – ఈ సీరియల్స్ మొత్తం చూడందే కదల్లేను. ఆయనకెలా ఉందో ఏమో అని ఒకటే ఇదిగా ఉంది లోపల్లోపల! అవునే ఈ సీరియల్లో రుక్మిణి ఏం చేసిందో చూశావా? సడెన్‌గా కోడళ్లందరికీ ఎదురు తిరిగి వాళ్ల మీద కిర్సనాయిలు పోసి తగలెట్టబోయింది.”

“ఆ పని ఎప్పుడో చేయాల్సిందమ్మా! అలాంటి రాక్షసుల్లాంటి కోడళ్లని ఎవరు మాత్రం ఎంత కాలం భరిస్తారు?

అలా సాగిపోతుంటుంది వ్యవహారం.

ఇక యంగ్ గాళ్స్ కూడా అంతే!

చాన్స్ దొరుకుతే చాలు టివి లో వచ్చే డాన్స్ పోటీల్లో పార్టిసిపేట్ చేయడానికి తెలుగు సినిమాల తాలుకూ బూతు పాటలు ప్లే చేసుకొంటూ అందులోని బూతు పదాలకు దీటుగా హావ భావాలు వళ్లు విరుపులూ, ఛాతీ విసుర్లూ – కలిపి ప్రాక్టీస్ట్ చేస్తూంటారు.

రకరకాల ఛానెల్స్‌లో డాక్టరు సలహాలు ఇస్తూంటే పరస్పర విరుద్ధమయిన డాక్టర్ సూచనలు పాటిస్తూ హాస్పిటల్ పాలయ్యే పబ్లిక్ ఇంకొంత మంది.

పెళ్లి చూపులు జరగాల్సిన ఇంట్లో ఈ టివి సీరియల్స్ వల్లే కొంపల మీదకు రావటం చాలా ఈజీ!

పెళ్ళి కొడుకు వాళ్ళొచ్చేసరికి ఇంట్లో ఎవరూ కనిపించలేదు. పనిమనిషి వచ్చి అందర్నీ కూర్చోబెట్టి మంచినీళ్ళు తెచ్చింది.

“మా అమ్మగారు టివీ సీరియల్ చూస్తున్నారు. అయ్యగారు పైన ఇంగ్లీష్ న్యూస్ చూస్తున్నారు. పిల్లలు కార్టూన్ నెట్‌వర్క్ – ఇరవై నిమిషాల్లో అందరూ వచ్చేస్తారు!” అంటూ వినయంగా చెప్పింది.

దాంతో పెళ్ళివాళ్ళు మండిపడ్డారు.

“అంటే? అక్కడికి మేము టివి సీరియల్స్ చూడక్కర్లేదా? ఈ హాల్లో కూడా రెండు టివీ లు పడేస్తే మేమందరం మాక్కావలసిన చానెల్ చూసుకొనే వాళ్ళంకదా!” అంటూ గొడవ చేశారు.

“ఛ! నేను ముఖ్యమంత్రితో ఫోన్ ఇన్ కార్యక్రమం వదులుకుని వచ్చాను” అన్నాడు పెళ్ళి కొడుకు తండ్రి మండిపడుతూ. ఆ గొడవకు పెళ్ళి కూతురు తండ్రి పరుగుతో వచ్చాడు.

“ఇదిగో చూడండి! పెళ్ళి చూపుల తతంగం త్వరగా అవజేసుకొని మా అబ్బాయి ఇంటి కెళ్ళి ఇండియన్ అయోడిల్ ప్రోగ్రాం చూడాలి! అందులో తనకు నచ్చిన వాడికి ఓటు వేస్తూ ఎస్ఎమ్ఎస్ పంపించాలి.” అన్నాడు పె॥ కొడుకు తండ్రి.

"అయితే ఓ పని చేద్దాం! మా మిసెస్ – మనం అరచి గీపెట్టినా ఆ సీరియల్ అవందే రాదు. ఎందుకంటే తన చిన్నప్పటి నుంచీ ఒక్క ఎపీసోడ్ కూడా మిస్సవకుండా చూస్తోంది – కనుక మీరంతా వెళ్ళి ఆ చివరి గదిలో మా అమ్మాయి తనకిష్టమయిన టవీ ప్రోగ్రామ్ చూస్తోంది – అక్కడే మీరూ కూర్చుని పెళ్ళిచూపుల తతంగం కానిచ్చేయ్యండి."

వాళ్ళు హాపీగా వప్పుకున్నారు.

పెళ్ళి కొడుకు పెళ్ళి కూతురు ఆ టివి ప్రోగ్రాం చూస్తూనే మధ్య మధ్యలో పెళ్ళి చూపుల తతంగం కానిస్తున్నారు.

"మీరెక్కువ ఏ సీరియల్ లైక్ చేస్తారు."

"స్టార్‌వన్‌లో వస్తుంది ముసాఫీర్ – హసీనా' అనే సీరియల్. అది నా కిష్టం!" అంది పెళ్ళి కూతురు.

"ఏంటి? మీరు ఆ చెత్త సీరియల్ లైక్ చేస్తారా? పైగా అదో పెద్ద ముసురు" హర్ట్ అయిపోతూ అడిగాడు పెళ్ళికొడుకు.

"అది చెత్త సీరియల్ అన్నారంటే మర్యాదగా ఉండదు. ఆ హీరో నాడ్రీమ్ బాయ్! అతన్నేమయినా అంటే చెప్పు తీసుక్కొడతా" అందా అమ్మాయి.

"ఈ లోపే నీ పళ్ళు రాలిపోతాయ్! అన్నాడు పెళ్ళికొడుకు.

ఆ విధంగా ఆ పెళ్ళి చూపులు రసాభాస అయిపోయాయ్.

తమ కిష్టమయిన టివి సీరియల్ చూసే విషయంలో భార్యా భర్తలకు గొడవయి హత్య వరకూ దారి తీసిన సంఘటనలు మం పేపర్లల్లో చూస్తూనే ఉన్నాం. జడ్జ్ బోనులో నిలబడ్డ భర్తను జాలిగా చూశాడు.

"చూడు మిస్టర్ రాజూ! కేవలం ఒక చెత్త టవీ సీరియల్ విషయంలోనే నీకూ మీ ఆవిడకూ శత్రుత్వం ఏర్పడి విడాకుల వరకూ వెళ్ళింది. ఆ కోపంతోనే మీ ఆవిడ మీద రివాల్వర్‌తో కాల్పులు జరిపావ్! కానీ ఆ సీరియల్‌లో లీనమవటం వల్లే గన్‌లో బుల్లెట్స్ గురి తప్పి గోడకు తగిలాయ్ అందుకే రెంటికీ చెడ్డవాడివయ్యావ్!"

ఈ టీవి సీరియల్ ఎఫెక్ట్ ప్రేమ పక్షులు మీద కూడా పడుతుంది.

"శాంతీ! ఒక మాటడుగు తాను ఫ్రాంక్‌గా చెప్పు!"

"ఏంటది?"

"నువ్ నన్ను ప్రేమిస్తున్నావా? ఆ 'దుష్మన్' హిందీ  సీరియల్‌నా?"

"అనుమానమెందుకొచ్చింది శశాంక్! ఆ హిందీ సీరియల్నే ఎక్కువ లవ్ చేస్తాను!" శశాంక్ హాపీగా ఫీలయ్యాడు.

"థాంక్ గాడ్! అయితే నేను తనని పెళ్ళి చేసుకోనవసరం లేదన్నమాట!" అనుకున్నాడు.

ఇంట్లో ఇంటావిడకీ, పని మనిషికీ గొడవయింది. "చూడండమ్మ! రేపట్నుంచీ నేను పన్లోకి రావటంలేదు–"

"ఎందుకు?"

"రోజూ సాయంత్రం రెండు సీరియల్స్ మీ టివీలో చూబిస్తానికి ఒప్పుకున్నారనే నేను పనిలో చేరాను. రెండు నెలలు చూబించాక ఇప్పుడు ఒకటే సీరియల్ చూడనిస్తున్నారు.

"సరే – మానేసెయ్" అంది ఇంటావిడ.

భర్త కంగారుగా భార్యను పక్కకు పిలిచాడు.

"అదేంటే! పని మనుషులు దొరక్క ఛస్తూంటే ఉన్న దాన్ని మానిపించేస్తావేంటి? పోనీ ఆ రెండు సీరియల్స్ చూపించకూడదూ?"

"ఆ రెండు సీరియల్లో హీరోయిన్ భర్త పనిమనిషిని రెండో పెళ్ళి చేసుకుంటాడండీ!" ఎలా చూపించనది? చిరాగ్గా అంది భార్య.

ఒక ప్రియుడు దౌటుగా ప్రియురాలి నడిగాడు.

"అది కాదు డియర్! నేను నీ గదిలోనే వారం రోజుల్నుంచీ రాత్రింబగళ్ళు ఉండిపోయాను కదా! మీ అమ్మా నాన్నలు గొడవ చేస్తారేమో–"

"వాళ్ళ మొఖం! ఆ టివీ ప్రోగ్రామ్స్‌లో పడిపోతే వాళ్ళకు మూడో మనిషి గురించి తెలీదు డోంట్‌వర్రీ–"

ఇక టివీ లో యాడ్స్ గురించి చెప్పాల్సిన పని లేదు.

క్షణానికో యాడ్ – సీరియల్స్ కంటే ఎక్కువ సమయం యాడ్స్‌తో గడపాల్సి వస్తుంది.

ఒక టివీ చానెల్లో వార్తల ప్రోగ్రాం వస్తోంది.

"ఇప్పుడే అందినవార్త. అంతరిక్షంలో ఉన్న ఒక ఉపగ్రహం రిమోట్ కంట్రోల్ ఫెయిలవ్వడంతో – వేగంగా – ఇంకో అరగంటలో మన భూగాన్ని ఢీ కొట్టబోతోంది. ఆ ఇంపాక్ట్‌కి భూగోళం అంతా ముక్కలు ముక్కలు అవబోతోంది. ప్రజలందరూ దేవుడి భజన చేయండి – ఇప్పుడు వ్యాపార ప్రకటనలు –